క్లుప్తంగా

కేజీబీవీ తనిఖీ



సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్న జడ్జి హేమ

చిప్పగిరి: స్థానిక కేజీబీవీ విద్యాలయాన్ని ఆలూరు సివిల్ జూనియర్ జడ్జి కె.హేమ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి, భోజనం, బోధన గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం స్టోర్ రూమ్‌లోని సరకుల వివరాలు, నాణ్యతను ఎస్‌ఓ సౌజన్యతో ఆరాతీశారు. పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన అందించాలని ఆదేశించారు.

హొళగుంద ఎస్‌ఐగా బాల నరసింహులు

హొళగుంద: ఎస్‌ఐగా బాల నరసింహులు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల పోలీసు ఉన్నతాధికారులు కర్నూలు వన్‌టౌన్‌లో విధులు నిర్వహిస్తున్న బాల నరసింహులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇక్కడ ఎస్‌ఐగా పని చేసిన పెద్దయ్యనాయుడును జిల్లాధికారులు కర్నూలు వీఆర్‌కు బదిలీ చేశారు.ఈయనకు సీఐ ప్రమోషన్ లభించే అవకాశముందని సమాచారం.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

హొళగుంద: పేదలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమని, ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు అన్నారు. గురువారం జమాతె అహ్లెహదీస్ యువత ఆధ్వర్యంలో స్థానిక తేరుబజారులోని డ్రామా కట్ట వద్ద కర్నూలుకు చెందిన మెడ్‌ప్లస్ బ్లడ్ సెంటర్, శ్రీచక్ర నేత్రాలయం సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య, రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



రూ.లక్ష అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామానికి చెందిన ఉప్పర మధుసూదన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. తోటి మిత్రుడు మృతి చెందడంతో 1998–99 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. ఈ మొత్తాన్ని మృతుడి కుమార్తెలు పేరుమీద డిపాజిట్ చేస్తున్నట్లు చెప్పారు. పూర్వపు విద్యార్థులు ఈరన్న, వెంకటేష్, పురుషోత్తం, మోహన్, నాగరాజు, లోకేశ్వరయ్య, లక్ష్మినారాయణ, లోకేష్, కోటిరెడ్డి, రామాంజనేయులు, రాజు, నాగన్న పాల్గొన్నారు.

రామతీర్థంలో గాయత్రీ మంత్ర జపం



శంకరబండ నుంచి కలశాలు, 108 బిందెలతో గాయత్రీ ఆలయానికి వస్తున్న భక్తులు

ఆస్పరి: మండల కేంద్రం సమీపంలోని రామతీర్థంలో వెలసిన పంచముఖి గాయత్రీ మాత ఆలయంలో గురువారం శంకరబండ గ్రామానికి చెందిన భక్తులు పంచముఖి గాయత్రీ మాత జపం చేస్తూ భజన చేపట్టారు. రామలింగేశ్వర స్వామి కొలను నుంచి నీటిని తెచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆకుపూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు, చిన్నారులు కలశాలు, 108 నీళ్ల బిందెలతో గాయిత్రీ నామ స్మరణ చేసుకుంటూ ఆలయం చేరుకున్నారు. ఈ నీటితో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారిని అభిషేకిస్తామని అర్చకుడు రూపామోహన్‌శర్మ తెలిపారు. శుక్రవారం రాత్రి వరకు భజనలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి

తుగ్గలి : గతేడాది రబీలో పంటలు సాగుచేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. తీవ్ర వర్షాభావంతో గతేడాది రబీలో సాగు చేసిన పంటలు చేతికందక రైతులు నష్టపోయారన్నారు. ప్రభుత్వం రబీ కింద కరువు మండలంగా కూడా ప్రకటించిందన్నారు. అయితే ఇంతవరకు అన్నదాతలకు పరిహారం అందలేదని, వెంటనే వారి ఖాతాలకు పరిహారం జమ చేయాలన్నారు. అలాగే పంటలకు బీమా వర్తించేలా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు, మండల కమిటీ సభ్యులు కొండారెడ్డి, రంగరాజు, శ్రీనివాసులు, ఈశ్వరప్ప, రంగస్వామి పాల్గొన్నారు.

సంగోళీరాయన్న జయంతి

హొళగుంద: స్థానిక బీరలింగేశ్వర ఆలయంలో సంగొళ్లి రాయన్న సేనా సంఘం అధ్యక్షుడు చిన్న ఆధ్వర్యంలో సైరా సంగోళీరాయన్న 226వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో చిన్న, మాదాసి, మాదారి కురువ సంఘం మండలాధ్యక్షుడు పంపా, గాదిలింగ, పెద్దాట మల్లయ్య తదితరులు మాట్లాడుతూ సంగోళీ రాయన్న ప్రజల్లో గూడుకట్టుకున్న అజ్ఞానాన్ని తొలగించారని కొనియాడారు. నారెగల్ సిద్దప్ప, గాదిలింగ, కాంత, చంద్ర, వీరేష్, నరగల్లప్ప, కనకశ్రీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మురిసిన మువ్వన్నెలు

- వాడవాడలా వేడుకగా స్వాతంత్య్రదినోత్సవం
- జాతీయ పతాకం ఎగురవేత

తుగ్గలి(పత్తికొండ) : నియోజకవర్గంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కోర్టు ప్రాంగణంలో జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి, ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ ఎన్ రామలక్ష్మి, తహసీల్దార్ కార్యాలయంలో వెంకటలక్ష్మి, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ జయన్న, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నారాయణదాసు, పాఠశాలల్లో సర్పంచ్‌లు, ఎస్‌ఎంసీ చైర్మన్లు జాతీయ జెండాను ఎగురవేశారు. పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న స్వీపర్‌ను మాజీ ఎంపీపీ ఎస్ నాగరత్నమ్మ, సర్పంచ్ కొమ్ము దీపిక సన్మానించారు.

తుగ్గలిలో..

తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగరాజు, జొన్నతండా పాఠశాలలో జెడ్పీటీసీ సభ్యుడు పులి కొండనాయక్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నాగప్ప, పోలీస్ స్టేషన్లలో ఎస్‌ఐలు చంద్ర, జమీర్, సొసైటీల్లో సీఈవోలు గిడ్డయ్య, మనోహర్‌నాయుడు, విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ మహేశ్వరరెడ్డి, పాఠశాలల్లో సర్పంచ్‌లు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లు జాతీయజెండాను ఎగురవేశారు. జొన్నగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో పీఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు రఘు పదో తరగతిలో ఉత్తమ



పత్తికొండ కోర్టు ప్రాంగణంలో గాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్జి, న్యాయవాదులు

మార్కులు సాధించిన విద్యార్థులు అనితకు రూ.2,500, సరిత రూ.1500, అభిషేక్ రూ.వెయ్యి నగదు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..

స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలని ఎంపీపీ నారాయణదాసు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ సోమశేఖర్, నాయకులు శ్రీరంగడు, నాగరాజు, భాస్కర్‌నాయక్ గణపతి పాల్గొన్నారు.

చిప్పగిరి: మండలంలో 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, ఎంపీపీ జూటూరు హేమలత, కన్వీనర్ మారయ్య స్థానిక గ్రామ సచివాలయం, కేజీబీవీ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి మహనీయులను స్మరించుకున్నారు. సర్పంచ్ గోవిందరాజులు, ఎంపీటీసీ రజిని, నాయకులు రాములు, వెంకటేష్, గోవిందు, జనార్దన్, బోగేష్, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

వెల్దుర్తి: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను గురువారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఇన్‌చార్జ్ ఎంపీపీ రంగడు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, ఎంపీడీఓ శివ మల్లేశ్వరప్ప, పోలీస్ సర్కిల్ కార్యాలయం సీఐ మధుసూదన్‌రావు జాతీయ జెండా ఆవిష్కరించారు.



ఆర్డీవో కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి



పత్తికొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



ఆలూరు సీఐ కె. శ్రీనివాసనాయక్ ఆధ్వర్యంలో..

ఆలూరు: స్థానిక జేఎంఎఫ్ కోర్టు ఆవరణలో న్యాయమూర్తి హేమ,ఆలూరు తహసీల్దార్ కార్యాలయంపై తహసీల్దార్ గోవిందుసింగ్, పోలీసుల సర్కిల్ కార్యాలయంపై సీఐ కె.శ్రీనివానాయక్ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీఓ కార్యాలయంలపై ఎంపీపీ రంగమ్మ, జెడ్పీటీసీ ఏరూరుశేఖర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్, అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, జూనియర్ కళాశాల, ఐటీఐ, సెబ్ కార్యాలయంలో పాలిటెక్నిక్, ప్రైవేటు పాఠశాలలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఏడీఈ, ఏడీఏ, పశుసంవర్ధక శాఖ, హౌసింగ్ డీఈ, వెలుగు కార్యాలయ ఏపీడీ, గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అరుణాదేవి, సీహెచ్‌సీలో డాక్టర్ మహ్మద్ వాహిద్, కాస్మోపాలిటిన్ క్లబ్ ఆవరణలో గుమ్మనూరు శ్రీనివాసులు జెండా ఎగురవేశారు.



మద్దికెరలో జెండాఎగురవేస్తున్న ఎంపీపీ అనిత



మద్దికెరలో జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్ హుసేన్

ఆస్పరి: మండల కేంద్రంతో పాటు గ్రామాలలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ శివశంకర్ నాయక్, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ సుంకర ఉమాదేవి, పోలీస్ స్టేషన్‌లో సీఐ మస్తాన్‌వలి, సచివాలయ ఆవరణలో సర్పంచ్ మూలింటి రాధమ్మ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రఘురామిరెడ్డి, కైరుప్పల సీపీఐ కార్యాలయం వద్ద పార్టీ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆస్పరిలో పంచాయతీ కార్మికులను సన్మానించారు. జెడ్పీటీసీ దొరబాబు, కేడీసీసీ మాజీ జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర పాల్గొన్నారు. కైరుప్పల జెడ్పీ ఉన్నత పాఠశాలలో కామ్రేడ్ బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు ముబీనా రూ.3వేలు, వీణ రూ. 2వేలు, మహేశ్వరి రూ. వెయ్యి అందజేశారు.

హొళగుంద: మండలంలో గురువారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పోలీస్‌స్టేషన్, తహసీల్దారు, ఎంపీడీఓ, ఎమ్మార్సీ కార్యలయాలు, ప్రభుత్వ జూనియర్ కాలేజ్, సింగిల్‌విండో, కేజీబీవీ, సచివాలయాలు, పంచాయతీ కార్యలయాల్లో ఎంపీపీ తంబాకు నూర్జహన్‌బీ, వైస్ ఎంపీపీ గాదెమ్మ, ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు, ఎంఈఓలో సత్యనారాయణ, జగన్నాథం, తహసీల్దారు ప్రసాద్‌రాజు, హొళగుంద సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ మువ్వెన్నల జెండాను ఎరుగువేశారు.



చిప్పగిరి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

కృష్ణగిరి: 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని గురువారం మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ చంద్రశేఖర్, మండల పరిషత్, ఉపాధి కార్యాలయాల వద్ద ఎంపీడీఓ విశ్వమోహన్, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్‌ఐ ఖాజావలి, వ్యవసాయ కార్యాలయం వద్ద ఏఓ వెంకటేశ్వర్లు, గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ వరలక్ష్మి, ఎమ్మార్సీ వద్ద ఎంఈఓ సునంద, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద డాక్టర్లు ప్రదీప్, వరప్రసాద్, ఐకేపీ వద్ద ఏపీఎం మహేష్, విద్యుత్ కార్యాలం వద్ద ఏఈ మద్దిలేటి, ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పాఠశాలలు, వసతి గృహాల్లో యజమాన్య కమిటీ చైర్మన్‌లు, కంబాలపాడు పాఠశాలలో మాజీ జెడ్పీటీసీ కేఈ జయన్న, నందీష్‌గౌడ్‌లు, పెనుమాడ చెరువు వద్ద ఏపీఓ శేషిరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. కర్లకుంట పాఠశాల వద్ద ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు.

హాలహర్వి: మండలంలో గురువారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నెట్టికంటమ్మ, తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి జెండా ఎగురవేసి వందనం చేశారు.



చిన్నహ్యాటలో వివిధ వేషధారణలో విద్యార్థులు



ఆస్పరి పోలీస్ స్టేషన్ దగ్గర జెండాకు వందనం చేస్తున్న సీఐ, పోలీసులు



వెల్దుర్తిలో జెండాకు వందనం సమర్పిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ



ఆస్పరిలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ శివశంకర్ నాయక్



మద్దికెరలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సర్పంచ్ సుహాసిని



కృష్ణగిరి పోలీస్‌స్టేషన్ వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ ఖాజావలి



దేవనకొండలో జెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ లక్ష్మిదేవి, ఎంపీడీఓ గౌరీదేవి

దేవనకొండ: మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాల్లో 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మిదేవమ్మ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీఓ గౌరీదేవి, జెడ్పీటీసీ రామకృష్ణ, లముంబా పాల్గొన్నారు.



జాతీయ పతానికి వందనం సమర్పిస్తున్న తహసీల్దార్

మౌలిక వసతుల కల్పనకు కృషి

చిప్పగిరి: ఆలూరు నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి పేర్కొన్నారు. గురువారం స్థానిక గ్రామ సచివాలయంలో నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమం, సర్పంచ్ గోవిందారుజులు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో జగనన్న ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాజకీయాలకు అతీతంగా పాలన సాగించారని గుర్తు చేశారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు మాత్రం కార్యకర్తలు బాగుపడేలా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఎంపీపీ జూటూరు హేమలత,కన్వీనర్ మారయ్య,సర్పంచులు గోవిందరాజులు,ఎంపీడీఓ కొండయ్య,పంచాయతీ కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగించాలి


ఆలూరు: సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు ఆరోగ్య శ్రీ బకాయిలు ఉన్నాయని.. ఇక నుంచి వైద్య సేవలను నిలిపి వేస్తున్నామని అసోసియేషన్ సీఈఓలు ప్రకటించిందని.. ప్రభుత్వం వారితో చర్చలు జరిపి వైద్య సేవలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటనను విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పేద రోగులకు కార్పొరేట్ వైద్యసేవలను నిరంతరాయంగా అందించామని గుర్తు చేశారు.




చిప్పగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

కొనసాగుతున్న దశమి ఉత్సవాలు

ఆస్పరి: మండలంలోని తంగరడోణలో వెలసిన చింతలముని, నల్లారెడ్డి స్వాముల దశమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆలయాల్లో గురువారం గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మొదట చింతలముని ఆలయం నుంచి తెల్లవారుజామున 4గంటలకు స్వామి వారి అశ్వంతో పాటు చింతలముని, ఓబులేశు, బాలముని స్వాముల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా కొండల్లో వెలసిన నల్లారెడ్డి స్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ నల్లారెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు చేసి చింతలముని స్వామి ఆలయం చేరుకున్నారు. ఊరేగింపులో అశ్వానికి భక్తులు బిందెలతో నీళ్లు పోసి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త పార్వతి, సర్పంచ్ శంకరమ్మ, గ్రామ పెద్దలు సీతారామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకన్న, రంగన్న, రాజు పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకరణలో చింతలముని స్వామి, అశ్వాన్ని ఊరేగిస్తున్న భక్తులు


తంగరడోణ దశమి ఉత్సవాల్లో అపశృతి

- బాణసంచా పేలి 17 మందికి గాయాలు



ఆలయ ఆవరణలో బాణసంచా పేలి మంటలు ఎగిసిన దృశ్యం

ఆస్పరి: తంగరడోణ గ్రామంలో గురువారం చింతలముని, నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. బాణసంచా పేలి 17 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులు, ఆస్పరి సీఐ మస్తాన్ వలి తెలిపిన వివరాల మేరకు.. ఉత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారుజామున స్వాముల అశ్వాన్ని మేళతాళాలతో ఊరేగించేందుకు చింతలముని స్వామి ఆలయంలో ఏర్పాట్లు చేశారు. అప్పటికే పెద్ద ఎత్తున జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ భక్తులు అక్కడికి చేరుకున్నారు. సంప్రదాయం ప్రకారం మొదట చింతలమునిస్వామి ఆలయంలో భక్తులు పూల బాణాలు విడుస్తుండగా అగ్గి రవ్వలు ఆలయ మండపం సమీపంలో ఉంచిన బాణసంచా సంచిపై పడ్డాయి. దీంతో ఒక్కసారిగా పేలడంతో మంటలు ఎగిసి పక్కనే ఉన్న భక్తులకు మంటలు వ్యాపించడంతో తీవ్రంగాగాయపడ్డారు. గాయపడిన వారిలో రాయచూర్‌కు చెందిన బడెప్ప, సరోజమ్మ, గోవిందమ్మ, తేజస్విని, పుష్పావతి, అకుల్, రంజిత, అలంపూర్‌కు చెందిన మంజునాథ్, పద్మ, తంగరడోణకు చెందిన శ్రీనివాసులు, ఈరన్న, ఆదోని మండలం సలకలకొండకు చెందిన ఉరుకుందురెడ్డి, ఈరన్న, తుగ్గలి మండలం రాంపురానికి చెందిన చంద్ర, ముకెళ్లకు చెందిన మునెప్ప, బైలుపత్తికొండకు చెందిన కురువ లింగయ్య, గోనెగండ్ల మండలం బైలుప్పలకు చెందిన కుంతీదేవి తీవ్రంగా గాయపడ్డారు.గాయపడిన వారు చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందతున్నారు. ఈమేరకు ఆలయ దర్మకర్త మండలి సభ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



క్షతగాత్రుల వివరాలు సేకరిస్తున్న ఆస్పరి సీఐ మస్తాన్‌వలి

విద్యార్థులకు ఆర్థిక సాయం

కృష్ణగిరి: తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు సిరి హెల్త్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆర్థిక సాయం చేసింది. గురువారం జిల్లా పరిషత్ పాఠశాలలో జెండావిష్కరణ అనంతరం విద్యార్థులు ధరణి, ధర్మతేజలకు సర్పంచ్ లక్ష్మిఈశ్వరయ్య, హెచ్‌ఎం మైఖిల్ చేతుల మీదుగా రూ.5వేలను సొసైటీ అధ్యక్షురాలు గీత అందజేశారు. అలాగే ఎస్‌హెచ్ ఎర్రగుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైకోర్టు రిటైర్డు అధికారి కృష్ణమోహన్‌రెడ్డి.. మాజీ సీఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి జ్ఞాపకార్థం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఉపాధ్యాయులు బషీర్, హుకుంసింగ్, సొసైటీ మాజీ అధ్యక్షుడు పెద్దయ్య, చంద్రశేఖర్, రామకృష్ణ, కేశవులు, రంగడు, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం

చిప్పగిరి: మండలంలో ఉత్తమ సేవలు అందించిన ముగ్గురు అధికారులకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాలు దక్కాయి. గురువారం కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదుగా ఈఓపీఆర్డీ బాలన్న,హౌసింగ్ ఏఈ భవ్య,కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ బి.రాధమ్మ కర్నూల్‌లో పురస్కారాలు అందుకున్నారు.

తుగ్గలి : ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన పత్తికొండ, తుగ్గలి ఈవోపీఆర్డీలు మునిస్వామి,గోపాల్ స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా గురువారం కర్నూలులో మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్‌బాషా చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. వీరిని ఆయా మండలాల ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

హాలహర్వి: కొక్కరచేడు గ్రామంలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న రంగప్పకు ఉత్తమ సేవా పురస్కారం అవార్డు లభించింది. ఈ మేరకు గురువారం కర్నూలులో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా చేతులమీదుగా అవార్డును అందుకున్నారు.

వైభవంగా ముళ్లయ్య పూజ

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో వెలిసిన గాదిలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ముళ్లయ్య పూజ వైభవంగా జరిగింది. గూళ్యం, నిట్రవట్టి గ్రామాలకు చెందిన కరెమ్మ వంశీయుల ఆధ్వర్యంలో శ్రావణమాసం రెండో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

దాతల ప్రోత్సాహం అభినందనీయం



విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందజేస్తున్న దృశ్యం

హొళగుంద: ప్రతిభ చూపిన విద్యార్థులను దాతలు నగదు ప్రోత్సాహకంతో ప్రోత్సహించడం అభినందనీయమని హెచ్‌ఎం నజీర్ అహ్మద్, గ్రామ పెద్ద రాజ పంపన్నగౌడ్, ఎస్‌ఎంసీ చైర్మన్ ద్వారకనాథ్ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90 బ్యాచ్‌కు చెందిన మిక్కిలినేని వెంకట శివప్రసాద్ తన కుమార్తె సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దీప్తి పేరుతో గతేడాది పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. గతంలో దీప్తి ఇచ్చిన హామీ మేరకు మండల టాపర్ కాకి అక్షయకు రూ.50 వేలు, రెండవ స్థానంలో నిలిచిన ఆర్. హిందూజకు రూ.30 వేలు, మూడవ స్థానంలో నిలిచిన ముస్కాన్‌కు రూ.20 వేలు అందజేశారు. అనంతరం మిక్కిలినేని వెంకటప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. షాలీ షబ్బీర్, దుర్గాప్రసాద్, ఆదాం, వెంకటేష్, సాయిబేష్, వలి పాల్గొన్నారు.

పాము కాటుతో కూలీ మృతి

తుగ్గలి : పొలం పనులకు వెళ్లిన ఓ కూలీ పాము కాటుకు గురై మృతి చెందాడు. మండలంలోని మారెళ్లకు చెందిన మొట్టి చిన్న తిమ్మయ్య(38) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గురువారం బొందిమడుగులలో ఓ రైతు పొలంలో వేరుశనగ కట్టె తొలగించేందుకు వెళ్లాడు. పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే తోటి కూలీలు బైక్‌పై చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు చెప్పినట్లు గ్రామస్తులు చెప్పారు. మృతుడికి భార్య అనుమక్క, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తుగ్గలి పోలీసులు తెలిపారు.

ఘర్షణ.. కేసు నమోదు

దేవనకొండ: తెర్నెకల్ గ్రామంలో పొలం తగాదా విషయంలో ప్రసాద్ అనే వ్యక్తిపై గురువారం అదే గ్రామానికి చెందిన కొందరు దాడి చేశారు. ఈ దాడిలో ప్రసాద్ తలకు తీవ్ర గాయాలవడంతో వెంటనే కుటుంబ సభ్యులు పత్తికొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు 9 మందిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

చౌకదుకాణ డీలర్ మృతి

మద్దికెర : మండలంలోని ఎడవలి గ్రామానికి చెందిన చౌకదుకాన డీలర్ ఆకుల హనుమన్న (85) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ హుసేన్, రెవెన్యూ అధికారులు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, శాలివాహన సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర హనుమన్న మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

ఆస్పరి: కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ నారాయణ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో సీపీఎం నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడంలో జాప్యం చేయడం సరికాదన్నారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితం అమలు చేయకపోతే ప్రజలతో కలసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. వర్షాభావంతో ఖరీఫ్ సీజన్‌లో వేసిన పత్తి, వేరుశనగ, కంది, సజ్జ పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నాయకులు హనుమంతు, రంగస్వామి, బాలకృష్ణ పాల్గొన్నారు.